

సాక్షి పల్నాడు

గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 7026 క్యూసెక్కులు వదిలారు. బ్యాంక్ కెనాల్‌కు 1645 క్యూసెక్కులు వదిలారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి 51,042 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ఎగువ నుంచి 51,042 క్యూసెక్కులు వచ్చి ప్రాజెక్టులో చేరుతుంది.

శివాలయంలో స్వచ్ఛతా హి సేవ



పెదకాకాని: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతా హి సేవ-2024 కార్యక్రమంలో భాగంగా బుధవారం పెదకాకాని శివాలయంలో మొక్కలు నాటారు.

బూటకాల బాబు



ఎన్నికల ముందు పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరులో ఏప్రిల్ ఏడున సభ నిర్వహించిన అప్పటి టీడీపీ అధినేత , ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రగల్భాలు పలికారు. పేదలను సంపన్నులను చేస్తానని ఊదరగొట్టారు.

వక్ర'భాష్యం'



ఎన్నికల ముందు మే 6న టీడీపీ పెదకూరపాడు అసెంబ్లీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ఈనాడు దినపత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. సూపర్ సిక్స్‌పై ప్రగల్భాలు పలికారు. టీడీపీ పథకాలతో నకల జనుల సంక్షేమం అంటూ వక్రభాష్యం చెప్పారు. ఆ క్లిప్పింగ్ ఇది.

అంత'కన్నా' అంటూ మోసం




ఎన్నికలకు ముందు మే 3న టీడీపీ సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఈనాడు దినపత్రికతో మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలతో విప్లవం తెస్తామంటూ బీరాలు పోయారు. గత ప్రభుత్వం కన్నా మెప్పిస్తామని చెప్పారు.. తీరా ఎన్నికలయ్యాక మౌనం వహించారు.

మాయా మేనిఫెస్టో



ఎన్నికల ముందు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఇద్దరూ ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక(మేనిఫెస్టో) ప్రకటించారు. అందులో సూపర్-6 పథకాలకు తమ ప్రాధాన్యమని నొక్కివక్కాణించారు. పవన్ కళ్యాణ్ మరో అడుగు ముందుకేసి అధికారంలోకి వచ్చాక ఈ హామీలు అమలు చేయించే బాధ్యత తనదని ఘంటాపథంగా చెప్పారు. ఇప్పుడు ఏమీ మాట్లాడకుండా మిన్నకుండిపోయారు.

బాబు బీద ఆరుపులు



1. తల్లికి వందనం ఎప్పుడిస్తారు? మా వద్దకు డేటా ఇంకా రాలేదు..
2. రైతు పెట్టుబడి సాయం తేదీ చెప్పలేదు.. ఇంకా ఏమీ అనుకోలేదు..
3. దీపావళికి గ్యాస్ వెలిగేనా? అమలుపై సీఎం ప్రకటన
4. ఆర్టీసీలో ఉచిత ప్రయాణమెప్పుడో? కసరత్తు చే..స్తున్నాం.
5. నిరుద్యోగ భృతి సంగతేంటి? అమ్మో ఆర్థిక సంక్షోభంలో ఉన్నాం..
6. మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామన్నారు? రోడ్ మ్యాప్‌లవీ పూర్తిచేశాక ఆలోచిద్దాం



ఏరుదాటాక తెప్ప తగలేయడం.. నమ్మిన జనాన్ని నట్టేట ముంచడం చంద్రబాబుకు అలవాటైన విద్యే.. ఎన్నికల ముందు ఆల్ ఫ్రీ అంటూ ఊదరగొట్టడం.. తీరా గెలిచాక ఆల్ ఫూల్ చేయడం ఆయనకే తెలిసిన 'మాయ' మంత్రం. ఇటువంటి మోసాల్లో 'ఆరు'తేరిన చంద్రబాబు ఈ సారి సైతం అక్కడ, ఇక్కడ నుంచి కాపీ కొట్టిన పథకాలతో సూపర్ సిక్స్ అంటూ జనం ముందుకొచ్చి, ప్రతి సభలోనూ ఊదరగొట్టారు.. గెలిచిన వెంటనే అన్నీ ఇచ్చేస్తాం అంటూ చెప్పిందే చెప్పి నమ్మించారు..తీరా గెలిచాక జనం నెత్తిన చెయ్యిపెట్టారు. పాఠశాల ప్రారంభానికే 'అమ్మ ఒడి'కి చేరే నగదుకు తల్లికి వందనం పేరిట మంగళం పాడారు. సాగు ఖర్చులకు 'భరోసా' నిచ్చే సాయానికి తూట్లు పెట్టి.. అన్నదాతలను అప్పుల పాల్జేశారు. 20లక్షల ఉద్యోగాలు, భృతిపై పెదవి విప్పక నిరుద్యోగులను నిండా ముంచేశారు. ఉచిత గ్యాస్ సిలిండర్‌ల హామీలను వందరోజుల పాలనలో అమలుచేయలేకపోయారు. ప్రతినెలా రూ.1500 ఇస్తామంటూ మహిళలను మోసం చేశారు. ఉచిత బస్సు ప్రయాణం అంటూ మహిళలను ఉసూరుమనిపించారు. ఇవన్నీ తెలుసుకున్న ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. హామీలన్నీ అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు.

సాక్షి, నరసరావుపేట: ఎన్నికల ముంగిట అధికారంలోకి వస్తే సూపర్-6 పథకాలను అమలు చేస్తామని చంద్రబాబు నాయకత్వంలోని కూటమి పార్టీలు ఊరూవాడా తిరిగి ప్రచారం చేశాయి. ప్రతి సభలోనూ సూపర్ సిక్స్ పథకాలను ఏకరువు పెడుతూ ఊదరగొట్టారు. పల్నాడు జిల్లాలోని కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు పచ్చమీడియాలో ప్రత్యేక ఇంటర్వ్యూ లిచ్చారు. చంద్రబాబు పెదకూరపాడు, సత్తెనపల్లి, పిడుగురాళ్లలో పర్యటించి సంపద సృష్టించి అన్ని పథకాలను అమలుచేస్తామని భరోసానిచ్చారు. తీరా పీఠం ఎక్కి 100 రోజులైనా చంద్రబాబు సూపర్-6 పథకాల అమలుకు నోచుకోలేదు. దీంతో సూపర్-6 పథకాలు అమలెప్పుడు చేస్తావంటూ చంద్రబాబును ప్రజలను నిలదీస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ తూ.చ.తప్పకుండా అమలు చేసిందని, చెప్పినవి చెప్పినట్లు చేయడమేకాకుండా చెప్పని హామీలను అమలు చేసిందని జనం గుర్తు చేస్తున్నారు.

బాబు ఏదీ జవాబు

తల్లికి వందనం..



తల్లికి వందనం పేరిట జిల్లాలో ఉన్న మొత్తం **3,23,711** మంది పిల్లలకు రూ.**15,000** చొప్పున ఇవ్వాల్సిన మొత్తం : రూ.**485.56** కోట్లు

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



నాకు ముగ్గురు పిల్లలు. ముగ్గురు పిల్లలూ ఇనిమెట్ల జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్నారు. సీఎం చంద్రబాబు ఎంతమంది పిల్లలు చదివితే అంతమందికి అమ్మకు వందనం పథకం ద్వారా తల్లుల ఖాతాలలో ఒక్కొక్కరికి రూ.15వేలు జమ చేస్తామని తెలిపారు. కానీ ఇంతవరకు ఒక్కరికీ కూడా వెయ్యలేదు. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.


– గడ్డిపర్తి కుమారి, ఇనిమెట్ల, రాజుపాలెం మండలం

అన్నదాత సుఖీభవ



ఒక్కోరైతుకు రూ.**20,000** చొప్పున మొత్తం **2,80,181** మంది రైతులకు కూటమి ప్రభుత్వం ఇవ్వాల్సిన మొత్తం రూ. **560.36** కోట్లు


ఖరీఫ్ సీజన్‌కు సాయం అందక అప్పులు చేశా..



ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం ప్రతి రైతుకూ రూ.20 వేల చొప్పున అందించాలి. ఈ పథకం అమలుపై ఇంత వరకు ఎలాంటి ప్రకటన చేయకపోవడం దారుణం. పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇకనైనా ఈ పథకం అమలుపై ప్రకటన చేయాలి. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఖరీఫ్ ఆరంభంలోనే సాయం విడుదల చేసేది. చంద్రబాబు ఇంత మోసం చేస్తారని అనుకోలేదు. వెంటనే ఎప్పుడు ఇస్తారో చెప్పాలి.

– నల్లబోతు సీతారామయ్య, ధూళిపాళ్ల, సత్తెనపల్లి

నిరుద్యోగ భృతి



జిల్లాలో ఉన్న కుటుంబాలు : **6,51,626**

ఇంటికొక నిరుద్యోగి చొప్పున మొత్తం సంఖ్య : **6,51,626**

వీరికి నెలకు రూ.3వేలు చొప్పున ఏడాదికి అందాల్సింది : రూ.**195.48**కోట్లు

నిరుద్యోగ భృతి త్వరగా అమలు చేయాలి



కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని త్వరగా అమలు చేయాలి. రూ. 3వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. హామీపై రెండు నెలలు కావస్తున్నా ప్రభుత్వం నుంచి ఎటువంటి చర్యలు తీసుకోకపోవటం బాధాకరం. ఇప్పటికే కోచింగ్‌లు తీసుకుంటూ, ఇంట్లో వారిపైన ఆధారపడ్డాం. భృతి త్వరగా ఇవ్వాలి. లేదా ఇంటికో ఉద్యోగం ఇవ్వాలి. డీఎస్సీ నోటిఫికేషన్‌తో సరిపెట్టారు.

–షేక్ జనత్‌హుస్సేన్, నార్నెపాడు, ముప్పాళ్ల మండలం

వైఎస్ జగన్ ఐదేళ్లలో చేసిన సంక్షేమ కార్యక్రమాలు



వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో పల్నాడు జిల్లాలో సంక్షేమం ఇంటింటి తలుపు తట్టింది. ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ క్యాలెండర్ ఏర్పాటు చేసి మరీ హామీలు అమలు చేశారు. అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, విద్యా దీవెన, వసతి దీవెన.. ఇలా ఒకటా రెండా ఇచ్చిన ప్రతి హామీ అమలైంది. ఇంటింటా సంక్షేమం వెల్లివిరిసింది.

జగనన్న అమ్మ ఒడి



1,92,598 లబ్ధిదారుల సంఖ్య

రూ.**977,45**కోట్లు నగదు లబ్ధి

వైఎస్సార్ రైతు భరోసా



2,80,181 లబ్ధిదారుల సంఖ్య

రూ.**1,738.58** కోట్లు నగదు లబ్ధి

వైఎస్సార్ చేయూత



95,534 లబ్ధిదారుల సంఖ్య

రూ.**430.43** కోట్లు నగదు లబ్ధి

జగనన్న వసతి, విద్యా దీవెన

లబ్ధిదారుల సంఖ్య **44,192**

నగదు లబ్ధి రూ.**162.03** కోట్లు

లబ్ధిదారుల సంఖ్య **48,143**

నగదు లబ్ధి రూ.**362.64** కోట్లు

నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు



39,303 లబ్ధిదారుల సంఖ్య

రూ.**7,074.5** కోట్లు నగదు లబ్ధి

వైఎస్సార్ పింఛన్ కానుక



2,81,269 లబ్ధిదారుల సంఖ్య

రూ.**3,438.4** కోట్లు నగదు లబ్ధి


మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

జిల్లాలో ప్రతిరోజూ తిరుగుతున్న బస్సులు : **461**

ప్రస్తుతం ప్రయాణికుల సంఖ్య: **1,41,717**

ఉచిత ప్రయాణం అమలుతో ప్రయాణికుల సంఖ్య : **1,63,017**

ఉచిత ప్రయాణం కోసం ఎదురు చూస్తున్న మహిళల సంఖ్య : **92,300**



ఉచిత బస్సుపై ప్రయాణంపై నోరు మెదపడం లేదు..



ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు ప్రజలకు సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చినహామీలు అమలుచేయాలని కోరుతున్నాం. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితప్రయాణం కల్పిస్తామని చెప్పారు. దీనిపై ఎవరూ నోరు మెదపటం లేదు.

– కుందూరి సంధ్యారాణి, నూజెండ్ల

మహిళలకు ప్రతి నెలా రూ.1500

మహిళకు నెలకు అందాల్సింది : రూ.**1500**

జిల్లాలో 18 నుంచి 59 ఏళ్ల మధ్య ఉన్న మహిళల సంఖ్య : **7,80,538**

వీరికి ఒక్కొక్కరికి నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి ఇవ్వాల్సిన మొత్తం : **1404.96**కోట్లు



ప్రతి మహిళకూ రూ.1500 ఇవ్వాల్సిందే..



18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.1500 ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. ఇప్పటివరకు ఈ పథకంపై విధివిధానాలు ఖరారు చేయకపోవడం. ఎప్పుడు ఇస్తారనే విషయంపై స్పష్టత లేకపోవటంతో పథకం అమలవుతుందా లేదా అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఇచ్చిన మాట ప్రకారం నెలకు రూ.1500 ప్రతి మహిళకు ఇవ్వాల్సిందే.

– గొంగటి సుబ్బమ్మ, ఉప్పలపాడు

ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం

జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్లు : **6,51,626**

ఒక్కో సిలిండర్ ధర ప్రస్తుతం : రూ.**900**

3 ఉచిత సిలిండర్లకు : రూ.**2700**

ఈ లెక్కన ఏడాదికి ప్రభుత్వం భరించాల్సింది : రూ.**175.93**కోట్లు



ఉచిత గ్యాస్ సిలిండర్లు రాలేదు

ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. అయితే వంద రోజుల పాలనలో అమలుకు నోచుకోలేదు.

– కె.దుర్గ, వినుకొండ



తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం పల్నాడు జిల్లా నేతలతో సమీక్షిస్తున్న వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

గట్టిగా నిలబడండి..మంచి రోజులొస్తాయి : వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్న గురజాల నియోజకవర్గ వైఎసాస్సార్ సీపీ కార్యకర్తలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలిసి మాట్లాడి వారికి ధైర్యానిచ్చారు. ఈ మధ్య గురజాల సోషల్ మీడియా కో ఆర్డినేటర్ వెన్నా రాజశేఖర్‌రెడ్డి, బ్రాహ్మణపల్లి సర్పంచ్ కుమారుడు షేక్ మాబూలాను కొద్దిరోజుల క్రితం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అక్రమంగా ఎస్సీ, ఎస్టీ యాక్ట్ పెట్టి అరెస్ట్ చేయించడమే కాకుండా పోలీసులతో కలసి దాడులు చేయించిన సంగతి తెలిసిందే. అక్రమంగా అరెస్ట్ అయిన కార్యకర్తలను గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి బుధవారం తాడేపల్లిలో వైఎస్ జగన్ దగ్గరకు తీసుకెళ్లి తెలుగుదేశం పార్టీ అరాచకాలను వివరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని, భయపడకుండా గట్టిగా నిబడండి.. మనకి మంచి రోజులు వస్తాయి, మీకు మంచి జరుగుతుందంటూ భరోసా ఇచ్చారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా పిన్నెల్లి నియామకం

పార్టీ అధ్యక్షుడి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన



నరసరావుపేట: వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా మాచర్ల మాజీ ఎమెల్యే, మాజీ ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మరోసారి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పల్నాడు జిల్లా ఏర్పడిన దగ్గర నుంచి పిన్నెల్లి పార్టీ అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. ఆయన నాలుగుసార్లు ఎమ్మెల్యేగాను, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ విప్‌గా కూడా వ్యవహరించారు.

24 వరకు ఎన్ఎంఎంఎస్ ఫీజు గడువు పొడిగింపు

డీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయిలో నిర్వహించే ఎన్ఎంఎంఎస్ పరీక్షకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈనెల 24వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. అలాగే ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజినల్ ఎస్‌బీఐ కలెక్ట్ రసీదును ఈనెల 27వతేదీ లోగా డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్షకు హాజరయ్యేలా విద్యాశాఖాధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇదేం తీరు అరవిందా!?

- మండల పరిషత్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ
- హింసలేని రాజకీయాలే చేద్దామంటూ గొప్పగా ప్రకటన
- ఎమ్మెల్యే సమక్షంలోనే టీడీపీ శ్రేణుల విధ్వంసం
- కార్యాలయంలో శిలాఫలకం ధ్వంసం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు


టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేసిన శిలాఫలకం

నరసరావుపేట రూరల్: చెప్పేది శ్రీరంగ నీతులు చేసేది దుర్మార్గ ఆలోచనలు అన్నట్టుగా ఉంది నరసరావుపేటలో టీడీపీ నాయకుల తీరు. హింస లేని రాజకీయాల కోసం అందరం కలిసి పనిచేద్దామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రకటించిన పది నిమిషాల్లోనే టీడీపీ కార్యకర్తలు మండల పరిషత్ కార్యాలయంలో శిలాఫలకం ధ్వంసానికి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఎంపీపీ మూరబోయిన వెంకాయమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలంటే ఘర్షణలు, దుర్మార్గపు ఆలోచనలు కాదన్నారు. కుల, మత, రాజకీయాలకతీతంగా అందరం కలిసి అభివృద్ధిలో పాలుపంచుకుందామని పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందిన దేశాల్లో నిర్వహించే ఎన్నికల్లో ఎలాంటి ఘర్షణలు ఉండవన్నారు. ఈ దిశగా మన రాష్ట్రంలో కూడా ప్రశాంతంగా ఎన్నికలు జరిగే పరిస్థితి రావాలన్నారు.

ఎమ్మెల్యే ఉండగానే ధ్వంసం..

సమావేశం అనంతరం ఎమ్మెల్యే చదలవాడ సమావేశ మందిరం నుంచి బయటకు వచ్చి అక్కడ ఉన్న కార్యకర్తలతో మాట్లాడుతున్నారు. ఈ సమయంలో మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ కోసం నిర్మించిన శిలాఫలాకాన్ని ధ్వంసం చేయడం ప్రారంభించారు. సుత్తులతో టీడీపీ కార్యకర్తలు విధ్వంసానికి పాల్పడుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తయినా చూడలేదు. ఒక వైపు హింసలేని రాజకీయాలు చేయాలంటూ పది నిమిషాల క్రితం ఎమ్మెల్యే ప్రకటించగా, టీడీపీ కార్యకర్తలు విధ్వంసానికి పాల్పడటంపై సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు ఆశ్చర్యానికి లోనయ్యారు. టీడీపీ నాయకులు చెప్పే మాటలకు చేసే పనులకు పొంతన ఉండదు అనే దానికి ఇదే ఉదాహరణ అని పెదవి విరిచారు.

రండి.. స్వచ్ఛందంగా సెల్ఫీ దిగివెళ్లండి..

నరసరావుపేట: జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు స్వచ్ఛతా హీ సేవకు మద్దతు తెలియచేస్తూ సెల్ఫీ దిగారు. కలెక్టరేట్‌లో బుధవారం ఐటీసీ బంగారు భవిష్యత్, సెర్ప్ ఎన్‌జీవో, జిల్లా గ్రామీణ నీరు, పారిశుద్ధ్యం విభాగం ఆధ్వర్యంలో ఐ సపోర్టు స్వచ్ఛభారత్ అనే అంశంపై సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు. దీనిలో కలెక్టర్‌తో పాటు డీఆర్వో కె.వినాయకం, డీఆర్‌డీఏ పీడీ బాలూ నాయక్, గ్రామీణ నీటిపారుదలశాఖ హెచ్‌ఆర్‌డీ రమేష్, ఇతర అధికారులు సెల్ఫీ పాయింట్ వద్ద సెల్ఫీ దిగి కార్యక్రమానికి మద్దతు తెలియచేశారు. సెర్ప్ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ సీహెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 17 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు జిల్లాలోని అన్నీ మండల స్థాయిలో తమ తోడ్పాటు అందజేస్తామని చెప్పారు.



సెల్ఫీ దిగుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

జిల్లాలో 13 స్కాన్ సెంటర్లకు అనుమతి

- గర్భస్థ లింగ నిర్ధారణకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు
- పరిశ్రమల్లో జీరో శాతం ప్రాణనష్టం లక్ష్యం కావాలి
- అధికారులతో కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: జిల్లాలో నూతనంగా 13 స్కాన్ సెంటర్లకు అనుమతులు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు నిర్ణయం తీసుకున్నారు. బుధవారం జిల్లాస్థాయి మల్టీ మెంబెర్ అప్రాప్రియేట్ అథారిటీ, డిస్ట్రిక్ లెవెల్ అడ్వైజరీ కమిటీ సంయుక్త సమావేశం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 164 ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులు లింగ నిర్ధారణ చట్టపరిధి కింద అనుమతులిచ్చామని, వీరందరూ కూడా చట్ట నిబంధనలకు లోబడి అన్ని రకాల రికార్డులను సక్రమంగా అమలు చేయాల్సి ఉందన్నారు.

జిల్లాలో నూతనంగా 13 స్కాన్ సెంటర్లు, 10 రెన్యువల్స్, 13 మార్పుల కోసం నమోదు చేసుకున్న వారికి లింగ నిర్ధారణ చట్టం కింద అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, అన్ని స్కానింగ్ సెంటర్లలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జేసీ సూరజ్ గనోరే, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి, నోడల్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, డీసీహెచ్ఎస్ డాక్టర్ మంత్రూ నాయక్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యురాలు డాక్టర్ ఎం.వసంత కిరణ్, సత్తెనపల్లికి చెందిన గైనకాలజిస్టు డాక్టర్ శోభారాణి, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో జీరోశాతం ప్రాణనష్టమే లక్ష్యం

పరిశ్రమలలో జీరో శాతం ప్రాణనష్టం జరుగకుండా అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో పరిశ్రమల నిర్వహణపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదభరిత పరిశ్రమలలో ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమగ్ర తనిఖీలు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా సిబ్బంది ఆరోగ్యం, రక్షణ, సంక్షేమంపై దృష్టి పెట్టాలన్నారు. తనిఖీల అనంతరం శాఖల వారీగా నివేదికలు అందచేయాలని, ఆ నివేదికలు ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందన్నారు.

2022లో వచ్చిన ప్రభుత్వ ఉత్తర్వుల తర్వాత ఎన్ని పరిశ్రమలు తనిఖీ చేశారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా జిల్లాలో గుర్తించిన 25 ప్రమాద భరిత పరిశ్రమలలో నిర్దేశిత ప్రణాళిక ప్రకారం సంబంధిత శాఖలు తనిఖీలు నిర్వహించాలన్నారు. పిడుగురాళ్లలో కాలుష్యం ఎక్కువగా ఉందని, కాలుష్య నివారణకు తగుచర్యలు తీసుకోవాలని పర్యావరణ శాఖాధికారిని ఆదేశించారు. తనిఖీలపై సంబంధిత శాఖల అధికారుల కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. కార్మిక శాఖాధికారి ధనలక్ష్మి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు నారాయణ, విద్యుత్, పోలీస్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, బాయిలర్స్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్లు ఇవే


బాలికల జట్టు


బాలుర జట్టు

నరసరావుపేట ఈస్ట్: ఉమ్మడి గుంటూరుజిల్లా స్కూల్ గేమ్స్ అండర్–17 బాల బాలికల ఫుట్‌బాల్ జట్లు ఎంపిక పోటీలను బుధవారం సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి బాలుర విభాగంలో 170 మంది, బాలికల విభాగంలో 90 మంది ఎంపిక పోటీలలోపాల్గొన్నారు. ఎంపిక పోటీల ప్రక్రియను స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ పర్యవేక్షించారు. ఎంపికైన జట్లు సెప్టెంబర్ చివరి వారంలో వినుకొండలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో ఉమ్మడి గుంటూరుజిల్లాకు ప్రాతినిథ్యం వహిస్తారని సురేష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి ఎం.రవి, మాజీ కార్యదర్శి వై.వి.చిరంజీవి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికల జట్టు..

ఎ.జాహ్నవిరెడ్డి, జె.శ్రీవల్లీ, ఎస్.గీతిక, ఐ.వాసంతి, కె.భవ్యశ్రీ (కొర్రపాడు), వి.దేవిక, పి.శ్రీలక్ష్మీ, జి.శ్రీవల్లీ (పెదమక్కెన), వి.ప్రవల్లిక, పి.షారోన్ వల్లిక, టి.హనీ, టి.శ్రీలక్ష్మీ, జి.నందిని, షేక్.బాజీద్‌బీ, పి.రమ్యశ్రీ, ఎం.భవిష్య, టి.స్వరూపరాణి (ఉప్పలపాడు), టి.ఎస్.ఎస్.మహేశ్వరి (సత్తెనపల్లి), ఎన్.శ్రావ్య (మాదల), పి.శ్రీలేఖ, బి.మోక్షసాధన (నందిగామ), బి.చంద్రిక (సుగాలి, సత్తెనపల్లి) ఎంపికయ్యారు.

బాలుర విభాగం..

పి.తేజ, పి.నవీన్ కుమార్ (నందిగామ), షేక్.సోహిల్ తన్వీర్, వెంకటగిరి (ఫిరంగిపురం), సయ్యద్ అలీ, ఇస్సాకు, ఆసీఫ్, జ్యోతి స్వరూప్ (మున్సిపల్ హైస్కూల్, నరసరావుపేట), షేక్.నాగనజీర్ (వాగ్దేవి కళాశాల, నరసరావుపేట), డి.సాయికుమార్ (కె.ఆర్ కళాశాల), శివమణి (సుగాలి, సత్తెనపల్లి), బి.రాఘవ, జి.సుభాష్ (అమరావతి), చరణ్ కుమార్ (కొర్రపాడు), బి.మహిధర్ (చినకాకాని), బి.జస్వంత్ నాయక్ (లయోలా, వినుకొండ), వై.పోతురాజు (పెదమక్కెన), డి.అంకమరావు, పి.నాగరాజు (మాదల) ఎంపికయ్యారు.

వరద బాధితులకు పరిహారం చెల్లిస్తాం

జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు

నరసరావుపేట: జిల్లాలో భారీ వర్షాలు, వరదల కారణంగా జరిగిన ఆస్తి, పశు నష్టానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనను అనుసరించి పరిహారం చెల్లిస్తామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు చెప్పారు. బుధవారం సాయంత్రం రాష్ట్రంలో వరద నష్టం వివరాలపై రెవెన్యూ స్పెషల్ సీఎస్ ఆర్‌పీ సిసోడియా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లాలో వరద నష్టం వివరాలు తెలియజేశారు. జిల్లాలో 15 మండలాలకు చెందిన 30 గ్రామాల్లో వరద ప్రభావం కనిపించిందని, 15 గ్రామాలు ముంపునకు గురికాగా మొత్తం 5,300 మంది వరద ప్రభావాన్ని ఎదుర్కొన్నారన్నారు. జిల్లాలో ఒకరు మృతి చెందగా, మూడు గొర్రెలు, ఒక లేగదూడ, ఒక వట్టి పశువు కలిపి మొత్తం ఐదు పశువులకు నష్టం వాటిల్లిందన్నారు. 873 ఇళ్లు ముంపునకు గురికాగా, వాటిలో ఆరు పక్కా ఇళ్లు, 69 కచ్చా ఇళ్లు, 17 గుడిసెలు పాక్షికంగాను, పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. దెబ్బతిన్న ఇళ్లకు తక్షణ సాయంగా రూ.10వేలు, వరదల్లో 15 శాతానికి మించి దెబ్బతిన్న ప్రతి ఇంటికి రూ.10వేలు అందించనున్నామని తెలిపారు. రెండు రోజులకు మించి ముంపునకు గురైన ఇళ్లకు రూ.10,000 అందిస్తామన్నారు. పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లకు ప్రధాన మంత్రి అవాస్ యోజన పథకం ద్వారా కొత్త ఇల్లు మంజూరు చేస్తామన్నారు. ఒక్కో గొర్రె, మేక నష్టానికి రూ.7,500, లేగదూడకు రూ.25వేలు, వట్టి పశువుకు రూ.40వేలు, పాడి పశువుకు రూ.50వేలు చొప్పున అందిస్తామన్నారు. పరిహారాన్ని బాధితుల బ్యాంకు అకౌంట్లలో నేరుగా జమ చేస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్వో కె.వినాయకం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ. 12 లక్షలు



దుర్గి: అడిగొప్పల శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి హుండీ కానుకలు లెక్కించగా రూ. 12,67,758ల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సైదమ్మ బాయి, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కారంపూడి గ్రూప్ టెంపుల్స్ ఈవో కృష్ణంరాజు ఆధ్వర్యంలో 27 రోజుల పాటు భక్తులు అమ్మవారికి సమర్పించిన హుండీ లెక్కింపు చేపట్టారు. కానుకల రూపంలో వచ్చిన ఆదాయాన్ని బ్యాంకు అధికారులకు అందజేసి సంబంధిత రసీదును తీసుకున్నట్లు అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంఆర్ సిబ్బంది, అర్చక, పరిచారక, నాయీ బ్రాహ్మణులు, భక్తులు పాల్గొన్నారు.

వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవు

- నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలను హెచ్చరించిన కలెక్టర్ అరుణ్‌బాబు
- డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవపై సమీక్ష

నరసరావుపేట: జిల్లాలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా పథకం క్రింద పనిచేసే నెట్‌వర్క్ ఆసుపత్రులలో పేదరోగుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు రుజువైతే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి.అరుణ్‌బాబు హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా క్రమశిక్షణ సంఘం సమావేశంలో జేసీ సూరజ్ గనోరేతో కలిసి ఎన్టీఆర్ వైద్యసేవలపై సమీక్షించారు. కొన్ని హాస్పిటళ్లలో రోగ నిర్ధారణ నిమిత్తం లబ్ధిదారులైన రోగులనుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, వాటిని నిర్ధారించి డీడీసీ కమిటీలో విచారణ చేసి బాధ్యులైన యాజమాన్యాలకు జరిమానా విధించాలని సూచించారు. ఈ పథకం క్రింద ఏ ఒక్కరోగి ఇబ్బందిపడినా సహించేది లేదని స్పష్టం చేశారు. రుసుము వసూలు చేసినట్లు తెలిస్తే యాజమాన్యానికి నోటీసులు ఇవ్వాలని, ఇది మళ్లీ పునరావృతం కారాదన్నారు. మీటింగ్‌లో 104–ఐవీఆర్ఎస్ అవుట్‌బౌండ్ కాల్స్ ద్వారా నమోదైన సమస్యలను కూడా విచారణ చేసి డబ్బులు వసూలు చేసిన హాస్పిటల్‌కి జరిమానా విధించటం జరుగుతుందన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ మంత్రూ నాయక్, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

23 వరకు ఈ–క్రాప్ నమోదు

డీఏవో మురళీ

నరసరావుపేట రూరల్: ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతులు వ్యవసాయ సహాయకుల ద్వారా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ తెలిపారు. మండలంలోని యల్లమంద రైతు సేవా కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. కేంద్రంలో అందుబాటులో ఉన్న ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ ఈ–క్రాప్ నమోదుకు ప్రభుత్వం గడువు పొడిగించినట్లు తెలిపారు. ఈనెల 23వ తేదీ లోపు ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. 25 నుంచి 27 తేదీ వరకు రైతు భరోసా కేంద్రాల్లో ఈ–క్రాప్ నమోదు జాబితాను ప్రదర్శించి గ్రామసభలు నిర్వహిస్తారని తెలిపారు. 28,29 తేదీలలో సోషల్ ఆడిట్ జరుపుతారని, 30వ తేదీ తుది జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తారని వివరించారు. రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదుతో పాటు ఈకేవైసీ చేసుకోవాలని తెలిపారు. జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ మస్తానమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.


యల్లమందలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న డీఏవో మురళీ

ఆధిక్యంలో సౌత్‌జోన్


షేక్ ఇస్మాయిల్


అనంత్ కార్తికేయ

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో ఏసీఏ ఇంటర్ జోనల్ క్రికెట్ పోటీల్లో భాగంగా కొనసాగుతున్న సౌత్‌జోన్, సెంట్రల్ జోన్ మధ్య మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. తొలి ఇన్నింగ్స్‌లో సౌత్ జోన్ ఆధిక్యతను చాటుకున్నది. నిన్నటి ఓవర్‌నైట్ స్కోర్ 5 వికెట్లు నష్టానికి 368 పరుగులతో బుధవారం రెండవరోజు ఆట ప్రారంభించిన సౌత్‌జోన్ తన తొలి ఇన్నింగ్స్‌లో 481 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన సెంట్రల్ జోన్ రెండవరోజు ఆట ముగిసే సమయానికి 8 వికెట్లు నష్టపోయి 186 పరుగులు చేసింది. జట్టులోని కార్తికేయ 84, ఎం.లేఖజ్‌రెడ్డి 52 పరుగులు సాధించారు. సౌత్‌జోన్ బౌలర్ షేక్.ఇస్మాయిల్ 17 ఓవర్లలో 52 పరుగులు ఇచ్చి 6వికెట్లు సాధించగా, రెడ్డి ప్రకాష్ 2వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. గురువారం మూడవరోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

రేపు జాబ్ మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: ఈ నెల 20న చేబ్రోలులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో జాబ్ మేళాలను నిర్వహించనున్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఇవి ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పిన్నింటి ప్రణయ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నలుగురికి డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి

నగరంపాలెం: రాష్ట్రంలోని పలు రేంజ్‌ల పరిధిలో 14 మంది సీఐలకు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి, పోస్టింగ్‌లు కల్పిస్తూ డీజీపీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. గుంటూరు రేంజ్‌లోని సీఐలు ఎం.రత్తయ్య, ఎండీ.మొయిన్, కె.సుధాకర్‌బాబు, పి.అక్కేశ్వరరావులకు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఎం.రత్తయ్య, కె.సుధాకర్‌బాబులకు ఇంటిలిజెన్స్ విభాగం డీఎస్పీలుగా, పి.అక్కేశ్వరరావును గుంటూరు డీఎస్ఆర్‌పీ డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. డీఎస్పీ ఎండీ.మొయిన్‌ను పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని తెలిపారు.

108, 104 వాహనాల్లో పోస్టుల భర్తీకి ఆహ్వానం

రేపల్లె రూరల్: 108, 104 వాహనాల్లో డ్రైవర్ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 జిల్లా మేనేజర్ పి.బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డ్రైవర్ పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణులై, 35 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు.